# విలువలు

జయంతి వెంకటరమణ

జి. టి. రోడ్డు మీద
తురాయి చెట్టు క్రింద
సూరప్పడి టీ దుకాణం ఆ వేళప్పుడు ఎప్పటిలాగే ఉంది రద్దీ లేక

మద్యాహ్నం ఒంటి గంట దాటిన వేళ అవటం చేత సూరప్పడు గల్లా పెట్టిని మనవరాలు వరహాలుకి అందించి నాలుగు మెతుకులు కతకడానికి సత్తు గిన్నె ముందు చతికిల పడ్డాడు పడమటికి ఉత్తరానికి ఉన్న రెండు పొడుగాటి బల్లల మీద కుర్చీ టేబిళ్ళకు అనుకుని కూర్చున గట్టియ్య తల దించుకుని నిద్రపోని సూర్రాజు వరహాలు చెప్పే మాటలు వింటున్నారు

కరువు రోజులొచ్చి పడినయ్ అన్నయ్యా! రూపాయి నోటుకి ఇలవ నేకపాయె ఇక ఈ బతుకేల? అంది వరహాలు టీ బల్ల దగ్గర సామాను సర్దుతూ

రూపాయి నోటు రూపాయి నోటు అంతన్నావు మరి రూపాయి నోటు ఏదన్నా కన్పడతందా అంట అన్నాడు గట్టియ్య

ఎందికి లెవ్వా! సిరిగినయో మాసినయో బొక్కలు పడ్డయ్యో కన్పడతన్నయి గదా! అన్నాడు ఉల్లిపాయ కొరుకుతూ సూరప్పడు

మా బాగ జెప్పినవ్! పది రూపాయల నోటుకే దిక్కునేదు రూపాయి కోసరం బాధ పడ్తన్నావు రూపాయో పది రూపాయలో ఇలవ ఉంటే గదా! అన్నాడు సూర్రాజు తల కొద్దిగా పైకెత్తి

ఎందికి నేదురా సన్నాసీ! రూపాయికి ఇలవ నేకపోతే మడిసి కెక్కడిదిరా ఇలవ రూక ఉన్నాడికే ఇలవ, రూక తోటే ఇలవ మీరంతా సిన్నోళ్ళు పెపంచకం తెలియనోళ్ళు పైసతోటేరా నాయినా పెపంచకం పైసాయే పరమాత్మ అన్నాడు సూరప్పడు తల వంచుకునే

అద్దదీ మాట ముప్పయి పైసలు జేబిలో నేందే దుకానంలోకి రానిత్తాడా సూరప్పడు మావ అన్నాడు గట్టియ్య సూర్రాజుతో తన పొడుగాటి తలపాగా సర్దుకుంటూ

ఎందికి రానివ్వడ్రా గడ్డే! మావ మావ అని జెప్పి అందరూ అరువులెట్టేసి నందికేగదరా ఊర్లో ఉండనేక ఉన్న ఇల్లు తణకాకి జమ కట్టేసి నాలుగు నారీలో బస్సులో ఆగే ఈ ఊరి చివర రోడ్డు మీన దుకాణ మెట్టుకుంది అడ బతుకునేక గదా ఈడ బతుకతంది మీలాంటోళ్ళు గాదురా తాతయ్యని దివాళా దీయించింది అంది వరహాలు కోపంగా పైట జాడించి మళ్ళా వేసికుని ఇప్పుడా ముసలోడికి తెలస్తన్నది రూపాయి ఇలవ అంది నడుము చుట్టూ పైట బిగిస్తూ

కాని మడిసికి ఇలవ ఉంది కనకనే ఈ కుసింత సోటైనా నాయుడిప్పించినడు అన్నాడు సూర్రాజు ఎగసెక్కెంగా మనిషి తెల్లగ సన్నగ పొడవుగా ఉంటాడేమో మాట డుతూంటే కాస్త అటు ఇటు ఊగుతాడు ముక్కు పుటాలు ఎగురుతాయి అతడు మాటాడుతూంటే

అవున్రా! నీకంతా ఇగటాలే అయినా నిజం నిజమే తాటికాయ నాక్కుని ఈత కాయ యిచ్చినడు కాదా నాయుడు రోడ్డు పక్క జాగా అది స్వంతమేటి కాదు కాని అతగాడెవురికీ పిటేసను ఎట్టకుండా కాపాడతన్నడని అతగాడు దేవుడని మామను క్కోవాలే అన్నాడు సూరప్పడు

నాయాలా! ఈ నాటికైన తెల్సుకున్నవ్‌గదా ఊర్లో ఉన్న ఇల్లు తణకాలో సెల్లు కట్టుకుని దారి పక్కన గవర్నమెంటోరి జాగా ఇచ్చినడు ఎంత పేమ కాని ఓ మాట నిజం ఎవరికైనది గదా! సూడు మడిసికి ఇలవ ఉంది కనికనే ఈదిన పడే సంసారం గుట్టుగ సాగతంది ఎవురి వల్ల నంతావు అన్నాడు సూర్రాజు రెండు కాళ్ళు బల్ల మీద పెట్టుకుని

ఎవురి వల్లనంతావు? నాయుడనుకుంతావా? కాదు భైరాగే సెప్పాల్సిన వారికి సెప్పి అళ్ళకి ఈళ్ళకి జెప్పి ఈడ పాక ఏయించినడు భైరాగి తాటి కమ్మ నాడు కాదా, కొట్టించి కొచ్చి బండి మీన తోలుకొచ్చింది అంది వరహాలు వరహాలు నిజాన్నేది దాచదు నిజం కాని దాన్ని అంగీకరించదు

ఎట్రా! నా మాటే అనుకుంటన్నారు అంటూ చూరు దాటి లోపలికి వచ్చాడు భైరాగి తన పొడవైన శరీరాన్ని వంచుతూ

నీ మాట అనుక్కోని దినమున్నదా దద్దా! నివ్వు నేకపోతే మామేటైపోదుము నాయుడికి నీకు సాటా! అనుకుంతన్నాము అంది వరహాలు

మంచితనమైన చెడ్డ తనమైనా అయిటయికి (మాటి మాటికి) అనుక్కోగూడదే వరాలూ అయిటయిటికి అనుకుంటే మంచితనం విలువ పోద్ది అంటూ బల్ల మీద కూర్చుంటూ ఎట్రా! ముసలోడా! తిండి అయిపోయిందేటి? మీసాలు తుడుచ కుంటన్నావు అన్నాడు బీడీ తీసి ముట్టిస్తూ భైరాగి

నివ్వు దుకానానికి వొచ్చే వేళ నాను సేతులు కడుక్కునె వేళ ఇందల ఇసిత్రం ఏటున్నాది అన్నాడు సూరప్పడు

విచిత్ర మేటీ లేదు గాని పంతులు గారికే బాగులేదంట అన్నాడు భైరాగి ముట్టించిన బీడిని పెదవుల మధ్య నుంచి ఒక్క పీల్పు పీల్చి అవతలికి పారేస్తూ జబ్బు బాగ ముదిరినాదంటున్నారు అన్నాడు అక్కడక్కడ తెల్లబడ్డ మీసాల ప్రక్కలకు సర్దుతూ ఏభై ఏళ్ళు దాటినా అంత వయసున్న వాడిలా కనపడడు భైరాగి మిలటరీలో పది సంవత్సరాలు పని చేసి వచ్చినవాడు చైనాతో యుద్ధం జరిగే రోజుల్లో యుద్ధంలో చేరిన వాడు పాకిస్తాన్‌తో ఇండియాకు వచ్చిన రెండు యుద్ధాలలో నెగ్గు కొచ్చి బయట పడ్డాడు ఉన్న ఒక్క కూతురికి పెళ్ళి చేసి పంపించేశాడు బార్యాతనే ఏ బాదర బందీ లేదు ఊరి బాదలన్నీ అతనివే ముతక చొక్కా కాకీ పాంటూ వేస్తూంటాడు చొక్కాకి ఎప్పుడూ బొత్తాలు పెట్టడు గుండె మీద అంజనేయ స్వామి బిళ్ళ ఎప్పుడూ ఇవతలికి కనపడుతూ ఉంటుంది

మరి వైజ్జగం సేయించనేదా? అంది వరహాలు వేడి టీ గ్లాసు అతని ముందుంచుతూ

కరణంగారబ్బాయి మందిస్తన్నాడు గాని గుణం కన్పడతాలేదు కే జీ ఆస్పిటల్‌కి తీసికెల్లండి అని చెప్పా మొన్నే ఇయ్యాళ బాగా లేదని తెల్సింది ఓ మారెల్లి చూసొద్దామని బయలుదేరా టీ తాగి పోదామని అంటూ అంత వేడి గ్లాసును అందుకుని అంత వేడి టీని గడగడతాగేశాడు భైరాగి

అన్నా! నీ వీడున్నావా? నీతో ఓ పని పడిందే బేగిరా! అంటూ సుడిగాలిలా దూసుకుంటూ వచ్చాడు చిన్రాములు

'ఎట్రా' అన్నాడు భైరాగి ముప్పయి పైసలు గల్లా పెట్టె మీద ఉంచుతూ

సెప్తాను రావే! అన్నాడు చిన్రాములు

సెప్పరా! ఏటా అరిజెంటు? అందుకుంది వరహాలు

అరిజంటే! ఆ బాబెవలో ఇశాపట్నం ఎల్తన్నాదంట మన దుకానం కాడి కొచ్చేతలికి అగంగరాయి సెట్టు కింద కొచ్చి కారు కదల్నని అగిపోందట డ్రైవరు కొత్తోడు అడికేటి తెల్దు ఇంజను సెడిపోనాదంటా గాబరా పడి పోతన్నాడు బాబు ఇశాపట్నంలో అరిజెంటు పని ఎనాగైనా గని మహా యిదయి పోతున్నాడు ఈడ నారీలు దప్ప బస్సు లాగవుగదా నాను చిన్రాములు నీకేటి బయము నేదు మా భైరాగి మావున్నడు అడు బస్సులు జీపులు కార్లు నడుపతడు అడికీ సెప్పినామంటే అడు బాగు సేత్తాడని చెప్పినము నీవు కసింత సూడాల మిలట్రీ బాబుల కాడ జీపు నడిపేటోడినని సెప్తావుగదా రా ఓసారి అంది చిన్రాములు వెనక వచ్చిన సీతాలు ఎడమ చెయ్యి నడుము మీద పెట్టుకుని కుడి చెయ్యి గాలిలో తిప్పుతూ

భైరాగి వాళ్ళిద్దరి ముఖాలు మార్చి మార్చి చూసి ఆ బాబు గాబరా పడ్తన్నాడో లేదో గాని మీ రిద్దరూ గాబరా పడిపోతన్నారేటే! అన్నాడు

అళ్ళకే గాబరా! నీకు తెలేనట్టు కారున్న బాబు నీకోసరం ఎదురు సూత్తన్నాడు కారు బాగు చేసే! నీకు మెదలిచ్చితాడు అని అందుకున్నాడు సూర్రాజు భుజాలెగరేస్తూ

డబ్బున్న బాబు లంటే నీ కెందుకురా అంత ఇది అందుకున్నాడు భైరాగి

నాకే ఇదీ లేదు ఎల్లిల్లు బాగ సుబ్బరంగా మెకానిజం చేసే అంటూ రెండు చేతులు ముణుకుల దగ్గరికేసి రెండు కాళ్ళను గుండెకి దగ్గరగా లాక్కున్నాడు సూర్రాజు

అది మాటకేట్రా దద్దా రా! ఎల్దాము అంది వరహాలు ఆకారుని దబ్బున్న బాబుని చూడాలని దానికి మహా ఇదిగా ఉంది

చిన్నాములు సీతాలు ముందు నడుస్తూంటే భైరాగి బయలు దేరాడు గద్దెయ్య వరహాలు భైరాగి వెనుక కదులుతూంటే ఓరమావా! దీన్ని ఒకారు న్నాడి కిచ్చి పెళ్ళి చేసిరా! అన్నాడు సూర్రాజు

రోడ్డు మీద కొస్తూ గంగరావి చెట్టు వేపు చూశాడు భైరాగి ఓ తెల్లకారు నోరు తెరుచుకుని చెట్టు కిందఉంది గ్రేకలర్ సూట్‌లో ఓ బాబు అతని పక్క కాకీ డ్రస్‌లో ఓ నల్లటి మనిషి కనపడ్డారు భైరాగికి కారుచుట్టూ చిన్నా పెద్ద ఓ పది మంది మూగి, కారుని కారున్న భాబుని చాల కుతూహలంగా చూస్తున్నారు

ముందుగా చిన్నామ్ములు పరుగెత్తు కెళ్ళి మా భైరాగి వత్తన్నాడు అని చెప్పాడు

చిన్నాములు వెనక పరుగేత్తే నడకతో వెళ్ళి

అడేనండి మా భైరాగి మావ అంది సీతాలు గుండె మీద నుండి పైట కొంగు జారిపోవడం కూడ గమనించకుండ

కారున్న ఆ బాబు భైరాగిని చూచి పరిచయమున్న వ్యక్తిని పలకరించినట్టు నవ్వాడు సీతాల్ని చూచి అతని రిమ్‌లెస్ కళ్ళద్దాలు నవ్వాయి

అయ్గారు వైజాగ్‌లో మినిష్టర్ గార్ని ఎయిర్ పోర్ట్‌లో కలియాలని బయలు దేరారు చాల అర్జెంటు పనిమీద నాలుగ్గంటల కల్లా ఎయిర్ పోర్ట్‌లో ఉండాలి దారిలో ఇది ఆగిపోయింది అన్నాడు భైరాగిని చూచి అడగకండానే డ్రైవర్

మణికట్టు మీదకు జారి పోయే ఖరీదైన వాచీని పైకి లాక్కుని టైము చూచుకుంటూ కంగారుగా ముఖం పెట్టాడు కారున్నబాబు

ఏటిట్రబులు? అన్నాడు భైరాగి ఇంజనులోకి తొంగి చూస్తూ డ్రైవరు కాసేపాగి అదేదో నాకు తెలిస్తే మీదాక ఎందుకొస్తాను బాబూ! అంతదూరం నుండి వస్తూ ఇక్కడి కొచ్చి బుర్ బుర్‌మంటూ ఆగిపోయింది అన్నాడు భైరాగికీ వినిపించేంత నెమ్మదిగా

భైరాగి మాటాడక పోవటం చూచి అతనే మళ్ళీ అన్నాడు

మీరు మిలటరీలో పని చేశారని మీకు ఈ మెకానిజం తెలుసని వీళ్ళంతా అంటున్నారు ఇక్కడ కారు ఆగిపోవడం కొంతలో కొంత మెరుగే మీరు తొందరగా బాగు చేస్తే మీ మేలు మరచిపోం అన్నాడు చేతులు పట్టుకునేందు కన్నట్టు రెండు చేతులు ముందుకి చాపుతూ

అయ్గారు మినిష్టర్ గారితో ముఖ్యమైన పని మీద బయలు దేరారు టయిముకి వెళ్ళకపోతే చాల చికాకు లొస్తాయి నాకు రాబోయే డ్రవర్ ఉద్యోగం పోతుంది గవర్నమెంటు ఉద్యోగం అన్నాడు నెమ్మదిగా ఎవరి అవసరాలు వారివని అర్థం చేసికున్నాడు భైరాగి

సెల్ఫుందా? అడిగాడు తల ఎత్తకండానే భైరాగి

పని చెయ్యదు అన్నాడు డ్రైవర్

మంత్రిగార్ని కలియ టానికి ఇట్టాంటి కారులో బయలు దేరారేమయ్యా! అన్నాడు సూర్రాజు అడెప్పుడొచ్చాడో రెండు కాళ్ళూ జాడించుకుంటూ

సూర్రాజా మాటలు కాస్త గట్టిగానే అన్నాడు

సూట్ వాలా విన్నాడు అతని ముఖం కందగడ్డలా అయింది కాలుస్తున్న సిగరెట్‌ను క్రింద పడేసి బూటు కాలితో రాస్తూ

మీరు తొందరగా పని చేసి పెట్టండి మేము ఊరికే చేయించుకోం మీరు ఆలస్యం చేస్తే చాల పనులు ఆగి పోతాయి అన్నాడు తెలుగు నేర్చుకున్న ఇంగ్లీషు వాడు మాటాడుతున్నట్టు అప్పులవాడు మా బాకీ మాకు తీర్చండి అనేమాదిరిగా అతను మాటాడు తూంటే ఎడమ వేపు పై రెండు బంగారు పళ్ళు మెరిశాయి

తవరు కసంత ఆ చెట్టు కింద కూర్చోండి ఒక్క



సిటంలో మరామత్తు చేసా్త నని అతనికి చెప్పి

ఓరి దేవుడూ! బాబు గారికి కుర్చీ అట్రా! బేగిపా్రా! అని బోనెట్ కింద తలపెట్టాడు

సూటు బాబు సీతాలు గుండెల వేపే చూసూ్తండగా దేవుడు కుర్చీకోసం పరుగెత్తాడు

రేడియేటర్ నొకసారి ముట్టుకు చూశాడు భైరాగి ఆయిల్ టాంకు నోసారి పరిశీలించి చూశాడు

బండి నో సారి స్టార్టు చెయ్యండి డ్రైవర్ బాబూ! అన్నాడు భైరాగి

డ్రైవర్ లోపలికెళ్ళి కూర్చుని ఇగ్నిషన్ కీ తిప్పాడు స్టీరింగ్ అందుకున్నాడు ఫలితం లేదు

దేవుడు గాద్రెజి కుర్చీ తెచ్చి చెట్టు మొదల్లో వేశాడు

సీతాలు వేపే ఓరకంటితో చూసూ్త దేవుడు తెచ్చిన కుర్చీలో కూర్చున్నాడు సూటు బాబు ఇబ్బందిగా

ఆ బాబు సూత్తన్నాడు సరిగేసుకో అంది వరహాలు సీతాలు పక్కకి తిరిగింది

ఎక్కడో ఎవరో కిసుక్కున నవ్వినట్టుంటే ఏమితో చక త్రిబుల్ఫైవ్ సిగరెట్ నందుకుని పాకెట్‌ను పాంట్ జేబులో పెట్టుకోబోతూ బాలయ్యా! వారు స్మోక్ చేసా్తరేమో ఇచ్చిరా! అంటూ డ్రైవర్‌ని పిలచి పాకెట్ నందించాడు సూట్ బాబు వరహాలు పక్కనే కనీ కనపడకండ ఉన్న సీతాలునే చూసూ్త లైటర్‌తో సిగరెట్ వెలిగించాడు

భైరాగి తల ఎత్తి చూచి బాలయ్య చేతిలోని సిగరెట్ పాకెట్‌ను చూచి నాకాడ బీడిఉందిలే ఇచ్చిరా అంటూ పక్కజేబు లోంచి బీడి అందుకుని బీడి వెలిగించి ఒక్కదమ్ము గట్టిగ లాగి బీడి అవతల పారేసి మళ్ళీ తల దూర్చాడు

సీతాకాలం అవటం చేత ఎండ వెన్నెల్లా ఉంది కోతలు అక్కడక్కడ మొదలవటం చేత రోడ్డు ప్రక్కగా ఉన్న చేలలో అక్కడక్కడ కూలిజనం కవలటం తప్ప రోడ్డు మీద నరసంచారం అంతగా ఎం లేమ రెండు మూడు లారీలు వచ్చాయి గాని

# విలువలు

ఆగకండ వెళ్ళి పోయాయి ఒక నాన్ స్టాప్ బస్సు ఒక పాసింజరు బస్సు ఒకదాని వెంట ఒకటి వెళ్ళి పోయాయి లారీలు మాత్రం ఉదయం పూట సాయంత్రాలలో సూరప్పడు దుకాణం దగ్గర ఆగి టీ తాగి పోవటం రివాజు

భైరాగి దగ్గరగా బాలయ్య నిలబడి చూసు్తన్నాడు

ఓ పాలి రెంచి అందుకోండి బాలయ్యగారూ! అన్నాడు భైరాగి బాలయ్య పరుగున వెళ్ళి టూల్సు కిట్ తెచ్చి పక్కన పెట్టాడు

ఎన్నేళ్ళ యింది డ్రైవింగ్ చేసూ్త! అడిగాడు భైరాగి టూల్సుకిట్‌లో తనకు కావలసి వాటిని వెతుక్కుంటూ

ఎళ్ళు కాదు నెలలు నెమ్మదిగా గొణిగాడు బాలయ్య

మెకానిజం నేర్చుకోలే

బాగరాదు అయినా ఈ ఎండి పాతది

ఈయన దగ్గరేనా ఉద్యోగం!

ఉద్యోగం కాదు ఉద్యోగం వేయిసా్తనని చెప్పారు లైసన్సు వారే ఇప్పించారు


సూట్ బాబు నెమ్మదిగా కారు దగ్గరికి వచ్చి

కారు బాగవుతుందా? ఎంత టయిము అవుతుంది? అన్నాడు నట్టుతూమాటాడుతూ

ఆయిల్ అందటం లేదుసార్! తవరు కాసింత కూచోండి అయిపోద్ది అన్నాడు భైరాగి తల ఎత్తకండానే

డిలే అవుతుందంటే బస్సులో వెళా్తను అన్నాడు వాచీ చూసుకుంటూ

ఈడ బస్సు లెవ్వి అగవు ఓ మైలు దూరం పోతే ఆదోరం సంతకాడ పాసింజరు బస్సాగుద్ది కాని పాసింజరు బస్సుల్నమ్మలేం ఏడ కాళ్ళు బార జాపుతయో ఆటికే తెల్దు సరిగా ఎల్తే రెండు గంటలు దాటుద్ది వొయిజాగ్ చేరే తలికి అన్నాడు



గడ్డెయ్య

నో! నో!! హో! హో!! కంగారు పడుతు అన్నాడు సూటు బాబు మినిష్టరు గారితో ఎంగేజ్ మెంటు హో! హో! అని గొణుగుకుంటూ

తవరు కసింత ఓర్చండి సార్! బాగవుద్ది అసలే పాతకారు తీగకదిలే్త దొంక కదులుద్ది అన్నట్టుంది అన్నాడు భైరాగి తల వంచుతూ

సూట్ బాబు మరో సిగరెట్ వెలిగించుకుని నెమ్మదిగా కుర్చీ దగ్గరికి నడచి వెళ్ళాడు కారు చుట్టూ మూగి ఉన్న పిల్లలు దారిసూ్తండగా! అతడి చూపులు గమనించింది వరహాలు ఎల్దాము రాయే మా తాత ఒక్కడే ఉన్నడు దుకానంలో అంటూ సీతాల్ని వేసికొని బయలు దేరింది వరహాలు

ఈ పాలి స్టార్టు చెయ్యండి బాలయ్యగారూ! అన్నాడు భైరాగి పక్కకు తప్పుకుని బాలయ్య లోపలికెళ్ళి స్టీరింగ్ అందుకున్నాడు

భైరాగి చిన్నగ నవ్వుకుంటూ గడ్డెయ్యా! చిన్నాములూ తవుడూ ఓది సన్నిగా తలో చెయ్యి వెయ్యండ్రా! అన్నాడు

ఎనక్కా! ముందికా! అడిగాడు తవుడు

ముందికే! అన్నాడు భైరాగి

అదంతా అప్పే రా అన్నా! తుమ్మసెట్టుకాడి కెల్లేంత వరకు అప్పే అంత దవ్వు బండి తోయాల్నా

ఈ మద్దినే స్టార్టవుద్దిలేరా! అన్నాడు భైరాగి బరోసా ఇసూ్త

నలుగురు కారు వెనక్కి వెళ్ళారు

పట్టవే! పట్టు తొయ్యి ముందుకి అనాగ తోసేనావంటే నాయాలా! పట్టు అదీ అద్గదీ అంటూ ఒకరి నొకరు హెచ్చరించుకుంటూ తోశారు అయిదారు బారలు తోసినా స్టార్టుకాలే

ఊ అన్నాడు భైరాగి

ఆగిన ఆ నలుగురు మళ్ళా ముందుకి అడుగేశారు మరో నాలుగు బారలు ముందుకెళ్ళినా లాభం లేక పొయింది

భైరాగి దారి పక్కనున్న ఒక పెద్ద రాయిని ఎంచి ప్రంటు వీల్ కింద పెట్టి మళ్ళా బోనెట్ కింద తల పెట్టాడు దద్దా! దద్దా!! నీ వీడున్నావా? పంతులు గార్ని ఇశాపట్నం తీసికెల్లాలంట నిన్నో పాలి రమ్మంతన్నారు రా రా! అంటూ వచ్చాడు సుడిగాలిలా నూకరాజు

వస్తన్న వస్తన్న అయి పోయిందిలే బాబు గారి కారుకి కసింత జొరం వసే్త అన్నాడు తల ఎత్తకండానే చేతులు లోపల తిప్పుతూ

అదికాదురా దద్దా! ఆదోరం సంత కాడికెలే్తనే గాని బస్సు దొరకదు నాయుడి గారి జీపు అడుగుదువు రా రా! ఎల్దాం అన్నాడు నూకరాజు భైరాగి భుజం పట్టుకుని

ఎప్పుడు వచ్చాడో సూటు బాబు వసా్తడు లేవయ్యా! ఈ పని అవనీ అన్నాడు భైరాగి వెళ్ళి పోతాడేమో ననే కంగారుతో

"అధికాదండి బాబయ్యా! మా పంతులు గారు మాకందరికీ పంతులుగారే. ఆరికి పానం మీనకొచ్చినాదండీ.... దద్దా! రా రా! ఓపాలి" అన్నాడు సూటు బాబుకి సమాధానం చెపుతూ.

"ఇదిగో..... అయిపాయె.... వస్తున్న..... ఇంతకీ పంతులు గారి కెట్టుందిరా?"

"మన లోకంలో లేడే దద్దా! నాయుడుగారి జీపు నేకపోతే సావుకారు బస్సు నాపించాల. నివ్వు రా రా!" అన్నాడు నూకరాజు.

"మరట్టయితే బస్సులో ఎట్టవుద్దిరా! అవదే.... బాలయ్యగారూ! ..... ఇగ స్టార్టు చెయ్యండి.... ఓ రె ఈపాలి హుషారుగా తొయండ్రా!" అంటూ బోనెట్ మూసి పక్కకు తప్పుకున్నాడు భైరాగి.

బాలయ్య స్టీరింగ్ అందుకున్నాడు.

ఎనిమిది చేతులు కారును ముందుకు నెట్టాయి.

సూట్‌బాబు ఆత్రంగా కారును వెంబడించాడు.

తుమ్మ చెట్టు వరకు నలుగురు ఒకరి నొకరు హెచ్చరించుకుంటు తోశారు చెమటను తుడుచు కుంటూ తుమ్మ చెట్టు నుండి నాలుగు బారలు తోసే సరికి కారు స్టార్టు అయింది.

భైరాగి ప్రక్కనే ఉన్న నేల మీది గడ్డితో చేతులు తుడుచుకుంటూ "రైట్! బాలయ్యగారూ" అన్నాడు.

"థాంక్యూ! థాంక్యూ!!" అంటూ సూటు బాబు ముందు కొచ్చాడు.

"దారిలో మరేట్రబులు రాదుకదా!" అన్నాడు భీతిని వ్యక్తం చేస్తూ సూటు బాబు.

"మరేట్రబులు రాదు. ఇంజను పార్టులు కొన్ని మార్చాల. వైజాగ్‌లో ఓపాలి కారును బ్రేక్‌లో ఉంచండి" అన్నాడు భైరాగి.

"థాంక్యూ!" అన్నాడు సూటుబాబు.

"ఆయిలు ఖర్చవుద్దని ఇంజను ఆపేకండి బాలయ్యగారు. ఖర్మగాలి దార్లో ఇంజను ఆగిపోయిందనుకోండి....."

"దద్దా! పంతులుగార్ని డోలీ కట్టివేస్తున్నారు. నీవో సారి నాయుడిగారికి సెప్పరా! జీపిత్తారేమోనని" అంటూ మళ్లా వచ్చాడు నూకరాజు.

# విలువలు

"ఎందికిరా– అది జరగని మాట అతగాడ్నడిగి లేదనిపించుకునేకంటే ఏరే చిన్నతనమేదీలేదు" అన్నాడు సూర్రాజు.

"మనం బయలు దేరుదామా!" అన్నాడు సూటుబాబు.

"అలాగేకాని... ,, భైరాగిగారూ... కారుదారో ఆగితే...." సందేహం వెలిబుచ్చాడు బాలయ్య.

"ఆగదు లేవయ్యా!" అంటూ భరోసా యిచ్చాడు భైరాగి.

సూటుబాబు వాచీ చూచుకుని జేబులోంచి పర్సు బయటికి లాగి అందులో నుండి 20 రూపాయల క్రొత్త నోటు తీసి "తీసికో" అన్నాడు.

"వద్దండిబాబు. అలా ఇవ్వకూడదండి.... చాల తప్పండి... నాకు చేతనైంది నేను చేశానండ" అన్నాడు భైరాగి వెనక్కి రెండడుగులువేస్తూ.

"ఫరవాలేదు. తీసికో" అన్నాడు.

"వద్దండి బాబూ... మీ దయుంటే అంతేశాను" అం "బాలయ్యగారూ!.... నేను సెప్పింది గురుతుంది గదా రైట్" అన్నాడు భైరాగి.

సూట్‌బాబు కారులో బ్యాక్ సీటులో కూర్చోగా ం బాలయ్య స్టీరింగ్ అందుకున్నాడు.

సూరప్పడు 'డవున్' నుండి పరుగు పరుగున వచ్చాడు

"ఒర్రీ మతిమండిపోనూ! సేతిలో ఉన్నదాన్ని వదిలేస్తావేరా! పంతులుగార్ని కే. జి. ఆస్పిటలికి తీసికెల్లమని సెప్పరా ఆ బాబుకి అదిగో పంతులుగోరి డోలీ వచ్చేసినాది" అన్నాడు సూరప్పడు.

భైరాగి మెదడులో ఓ వెలుగు వెలిగింది.

రెండడుగులు ముందుకు కదిలిన కారు ముందుకి పరుగెత్తి "బాలయ్యగారూ! కసింత ఆగండి... ఆగండి" అని చెప్పి బాలయ్యను చేరాడు.

బాలయ్య కారాపాడు.

## ప్రకృతి - వికృతి

ఎండాకాలంలో
కృష్టం చేయకున్నా
చెమట ఎట్తుంది
అది చూస వారి కష్టాల్ని
అంచనా వేయుకు
అది ప్రకృతి
అసలు కష్టపడేవారి
స్వేద బిందువులు
శ్రమ శక్తికి చిహ్నాలు
కర్తీ లేని వారి చెమటకు
విలువ కట్టకపోవటం
వికృతి

చివుకుల రామేశ్వర్

భైరాగి వెనకడోం డగరికే చేరి

బాబుగారూ! తమరు నాకో సాయం సెయ్యాల. మా పంతులుగారికి ప్రాణం మీదికొచ్చింది. అర్జెంటుగా కే జీ ఆస్పటల్‌కి దీసుకెల్లాలున్నారు మా కరణంగ రబ్బాయి తమరెలాగు వైజాగ్ ఎల్తున్నారు పంతులుగార్ని ఆ రబ్బాయిగార్ని మి కార వైజాగీ దాపురీకు సేర్చితేచాలు అట్నుంచి ఎదోలా ఎల్పోతారు తమరు ఈ చిన్నసాయం సెయ్యాల అన్నాడు.

సూటుబాబు ఇబ్బందిగా కారులో కదిలి

"చూడవయ్యా! నేను అర్జెంటుగా మినిష్టర్‌గార్ని కలియాలి ఎయిర్‌పోర్టు దగ్గర కలియకపోతే మర్యాదగ ఉండదు. వారితో నాకు చాల పనులున్నాయి. నీవు చాలా సాయం చేశావు నేను కాదనలేను. ఈ సారికి ఏమీ చేయలేను. మరోసారి తప్పక చేస్తాను... బాలయ్యా! కారు పోనియ్యి..." అన్నాడు.

భైరాగి చేతులు జోడించి–

"బాబూ! ఉపకారానికి ఉపకారం బదులు కొనక్కరలేదు కాని ఆ బాబు చావు బతుకుల్లో ఉన్నాడు. మాదో దిక్కుమాలిన ఊరు. ఇక్కడి పెద్దలు శవాన్ని పీక్కుతినే మదుసులు. ఇక్కడ ఎవరికీ జబ్బులు రాకూడదు. వస్తే కాష్టాలే దిక్కు.బాబూ... నా మాట కాదనకండి" అన్నాడు కదులుతున్న కారు వెంట నడుస్తూ భైరాగి.

"చావు బతుకుల్లో ఉన్న మనిషిని నేనెలా తీసికెళ్ళగలనయ్యా!.... దారిలో ఏమైనా అయితే... సారీ! నేనేమి చెయ్యలేను.... బాలయ్యా పద" అన్నాడు చూపు మళ్లించుకుని సూటుబాబు.

"అంతేనా బాబూ!" అన్నాడు భైరాగి.

"అంతే!" అన్నాడు కారున్నబాబు తలతిప్పకుండ.

వెనక ఎవరో నవ్వుతున్నట్టుంటే వెనుతిరిగాడు భైరాగి.

సూర్రాజు పెళ్ళున నవ్వుతు దగ్గరే ఉన్న పెద్దరాతిని రెండు చేతులతో ఎత్తాడు.

చటుక్కున భైరాగి ఆ చేతుల్ని పట్టుకున్నాడు.

కారు ముందుకి పోయింది. □

